క్లుప్తంగా

త్రికోటేశ్వర స్వామికి వెండి సామగ్రి వితరణ



నరసరావుపేట: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి నైవేద్యం సమర్పించేందుకు భక్తులు రూ.70 వేలు విలువ చేసే వెండిపళ్లెం, చెంబు బహూకరించారు. ఇటీవలే న్యాయవాది, మాజీ పీపీ కాకుమాను బాల హనుమంతారెడ్డి కుమార్తె వివాహం జరిగింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా కోటప్పకొండ ఈవో శ్రీనివాస రెడ్డికి నూతన వధూవరులు వాటిని అందజేశారు. కార్యక్రమంలో బాల హనుమంతారెడ్డి, కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రగతిపథంలో మన వినుకొండ పుస్తకం పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని ఉప్పలపాడు, పమిడిపాడు గ్రామ సచివాలయాల్లో ప్రగతిపథంలో మన వినుకొండ అనే పుస్తకాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నక్కా నాగిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండ నియోజక వర్గంలో చేసిన అనేక అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం బాలిరెడ్డి, చిన్నతరహా పరిశ్రమల స్టేట్ డైరెక్టర్ తలారి ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

శావల్యాపురం: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కృష్ణాపురం గ్రామ సమీపంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ పట్టణంలో ఒక హోటల్‌లో కూరగాయలు కటింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్న నరసింహారావు (35) తన స్నేహితుడికు చెందిన పల్సర్ బైకు తీసుకొని వ్యక్తిగత పనుల నిమిత్తం వినుకొండకు బయలుదేరాడు. మార్గమధ్యంలో జాతీయ రహదారి మార్గం కృష్ణాపురం గ్రామ సమీపాన గుర్తు తెలియని వాహనం ఢీకొని సంఘటన స్థలంలో నరసింహారావు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రేపు సాతులూరులో స్కూల్ గేమ్స్

నాదెండ్ల: చిలకలూరిపేట నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆటల పోటీలు సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రారంభమౌతాయని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.అంజమ్మ తెలిపారు. అథ్లెటిక్స్‌తో పాటూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14, 17 ఏళ్ల లోపు బాలబాలికలకు విడివిడిగా పోటీలు జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు తమ ఎంట్రీ ఫారాలతో సాతులూరులో జరిగే పోటీల్లో పాల్గొనాలన్నారు. అథ్లెటిక్స్ ఉదయం 8.30 గంటలకే ప్రారంభమౌతాయని హెచ్ఎం కె.వెంకటరావు తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్వే ముమ్మరంగా జరుగుతోంది. ఈ నెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కనమర్లపూడి గ్రామ సచివాలయ పరిధిలో ఆరంభం కానుంది. ఈ నేపథ్యంలో గ్రామంలో 750 నివాస గృహాలు ఉండగా ఇంటింటి సర్వేలో భాగంగా 12 మంది వలంటీర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఇరువురు సంయుక్తంగా సర్వే చేసి ప్రభుత్వం రూపొందించిన మొబైల్ యాప్‌లో ఆరోగ్య పరమైన సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్ వెల్లడించారు.

జీవాల పెంపకందారులకు రుణాలు

- 50 శాతం రాయితీతో..
- పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి కాంతారావు
- తిమ్మాపురం, యడ్లపాడు పశువైద్యశాలల సందర్శన



యడ్లపాడు: గ్రామీణ ప్రాంత ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల్ని ఆర్థికంగా అభ్యున్నతిని సాధించేందుకు జీవాల పెంపకందారులకు ప్రభుత్వం 50 శాతం రాయితీతో అందించే రుణాల్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కె.కాంతారావు పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపురం, యడ్లపాడు పశువైద్యశాలల్ని గురువారం ఆయన సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా విచ్చేసిన ఆయన వివిధ రకాల టీకాలు, మందులు, వైద్యులు అందిస్తున్న సేవలు తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు.


రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంచార పశువైద్య వాహనాలు 108 వాహనాల మాదిరిగానే గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు ఆపత్కాలంలో సత్వర వైద్య సేవలు అందిస్తున్నాయన్నారు. జిల్లాలో నియోజక వర్గానికి రెండు చొప్పున 14 వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు తమ పశువులకు అత్యవసర వైద్య సేవలు అవసరం అయితే 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఉచిత సేవల్ని అందుకోవాలన్నారు. వీటివల్ల పాడి రైతులకు టెన్షన్ తగ్గడంతో పాటు సమయం, ఖర్చులు ఆదా అవడంతో పాటు పశువులకు సకాలంలో తమ ఇంటి వద్దనే మెరుగైన చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి కాపాడుకోవచ్చన్నారు. ప్రస్తుతం గొర్రెలు, మేకలకు వచ్చే చీడపారుడు వ్యాధి నిరోధానికి సంబంధించిన వ్యాక్సిన్లు ఉచితంగా వేస్తున్నట్లు వివరించారు. ఈ ఉచిత టీకాల ప్రోగ్రాం ద్వారా జిల్లాలోని 6.32 లక్షల జీవాలకు అన్ని పశువైద్యశాలల్లో ఈనెల 15వ తేదీ నుంచి నెలరోజులు పాటు కొనసాగుతుందన్నారు.

అలాగే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమమైన నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ 50 శాతం రాయితీతో రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. క్షేత్ర స్థాయిలో జీవాల పెంపకందారులు, సహకార సంఘాలకు అవగాహన ఏర్పరిచేలా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈనెల చివరి నాటికి ఆర్‌బీకే అడ్వైజరీ కమిటీ సభ్యులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌లకు జేసీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో యడ్లపాడు ఏరియా పశువైద్యశాల ఏడీ డాక్టర్ వై.రాధాకృష్ణ, తిమ్మాపురం వైద్యురాలు షేక్ కలీషాబేగం, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా కొనసాగుతున్న గణపతి నవరాత్రులు



రామిరెడ్డిపేటలోని గణనాథుడిని దర్శించుకొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



మొక్కజొన్న కండెలతో పూజలందుకున్న గణనాథుడు

నరసరావుపేట ఈస్ట్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో వైభవంగా కొనసాగుతున్నాయి. పాతూరులోని మద్ది రాఘవయ్య బావి వద్ద యంగ్‌స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిరిలోని దశావతార సహిత శ్రీ విజయ గణపతికి గురువారం 1108 మొక్కజొన్న కండెలతో సహస్ర అష్టోత్తర శతనామావళితో పూజాధికాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. రామిరెడ్డిపేటలోని పాత పెద్దపోస్టాఫీసు వద్ద ఏర్పాటు చేసిన పందిరిలోని గణనాథుడిని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సందర్శించుకుని పూజలు నిర్వహించారు. కాగా, పట్టణంలోని చిన్న చిన్న పందిర్లలోని గణపతి విగ్రహాలను ఆయా పందిర్ల నిర్వాహకులు నిమజ్జనానికి తరలిస్తున్నారు.

బైబై గణేశా...



వేలంలో పాడుకున్న లడ్డూ ప్రసాదంతో ఇర్లా శ్రీను

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు కొత్తూరు రైస్‌మిల్లు వద్ద ఏర్పాటు చేసిన చవితి పందిరిలోని గణనాథుడిని గురువారం నిమజ్జనానికి తరలించారు. మూడు రోజుల ప్రత్యేక పూజల అనంతరం కమిటీ సభ్యులు గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించి అమరావతి ప్రాంతానికి తీసుకెళ్లారు. ఊరేగింపు సందర్భంగా భక్తులు తమ వీధిలోకి విచ్చేసిన స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించి ప్రసాదాలను పంపిణీ చేశారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో 9వ వార్షికోత్సవం వినాయక విగ్రహం నిమజ్జనం వేడుకలు కమిటీ సభ్యులు వైభవంగా గురువారం ఘనంగా నిర్వహించారు. విగ్రహాన్ని గ్రామానికి చెందిన కొంగల వాసు–తులసీరత్నం దంపతులు వితరణ చేశారు. వినాయక విగ్రహ లడ్డూను పాలడుగు సత్యనారాయణ (పెదకాపు) రూ.18 వేలకు కైవసం చేసుకున్నాడు. భారీ అన్నదానం కూడా ఏర్పాటు చేశారు. విగ్రహం నిమజ్జనం వేడుకల్లో భాగంగా మేళా తాళాలు కనకతప్పట్లు నడుమ విగ్రహాన్ని విద్యుత్ కాంతులతో ఘనంగా ఊరేగించారు. అలాగే మండలంలోని కనమర్లపూడి గ్రామంలో బొడ్రాయి వద్ద కాకతీయ యూత్ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూను యలవర్తి బ్రదర్స్ రూ.46 వేలకు బహిరంగ వేలంపాటలో దక్కించుకున్నారు.

రెండు గ్రామాల్లో వినాయకుని ఉత్సవాలు

రొంపిచర్ల: బుచ్చిబాపన్నపాలెం, సంతగుడిపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలకు గురువారం నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో వడియరాజుల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని పందిట్లో లడ్డూ ప్రసాదాన్ని ఇర్లా శ్రీను రూ.15 వేల రూపాయలకు పాడుకున్నారు. వడియరాజుల ఆధ్వర్యంలో 25 సంవత్సరాలుగా వినాయకుని ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. దారి పొడవునా ప్రసాదాలను పంపిణీ చేశారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నాలుగవ రోజు గణనాథుడు పూజలందుకున్నాడు. ఆయా ఆలయాలు, ప్రత్యేక చలువ పందిళ్లలో భక్తులు గణనాథునికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. గురువారం నిమజ్జన కార్యక్రమాలు కొనసాగాయి. సుమారు 10 విగ్రహాలకు పైగా నిమజ్జనాలు జరిగాయి. గణపవరం పశువుల ఆసుపత్రి సమీపంలో కాట్రువారి వీధిలోని విగ్రహానికి మహిళల ప్రత్యేక పూజల అనంతరం లడ్డూను బహిరంగ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన కెల్లంపల్లి శ్రీనివాసరావు, ఆయన కుమారుడు గోపీ ఐదు కేజీల లడ్డూను రూ.13 వేలకు హెచ్చుపాటలో దక్కించుకున్నారు. డప్పు వాయిద్యాలతో బాణాసంచా కాలుస్తూ పురవీధుల్లో సంబరాలు జరిగాయి. అనంతరం నాదెండ్ల డొంక రోడ్డులోని బుల్లెమ్మబావి సమీపంలో ఉన్న చెరువులో నిమజ్జనం జరిగింది.



గణపవరంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



యడ్లపాడులో గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

సత్తాచాటిన జెడ్పీ విద్యార్థులు



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు పార్వతి, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఝాన్సీరాణి

నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పలు పోటీలలో బహుమతులు సాధించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి గురువారం తెలిపారు. ఈనెల 17వ తేదీన రేపల్లెలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో 10వ తరగతి విద్యార్థి నామాల మనో విగ్నేష్ జూనియర్ విభాగంలో ప్రథమస్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే సమగ్రశిక్షా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలలో సీనియర్ విభాగం పరుగు పోటీలో ఆజోజి ఫణీంద్ర ద్వితీయస్థానం, జూనియర్ విభాగంలో బోసీ పోటీలలో దమ్ము మోహన్ ద్వితీయస్థానం సాధించినట్టు వివరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్‌పోటీలకు అండర్–14 విభాగంలో కొల్లి పర షణ్ముఖ సత్యవీర రుత్విక్ ఎంపికైనట్టు వివరించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు పార్వతి, వ్యాయామ ఉపాధ్యాయులు జి.ఝాన్సీరాణి, పి.తిరుపతిరావు, ఎస్.కె.ఫాతిమా, ఉపాధ్యాయులు అభినందించారు.

వడ్డెంగుంటలో మహిళా పాడిరైతులకు రుణమేళా



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసమూర్తి

బొల్లాపల్లి: మండలంలోని వడ్డెంగుంట గ్రామంలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మహిళా పాడి రైతులకు రుణమేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పయ్యావుల శ్రీనివాసమూర్తి పాల్గొని మాట్లాడుతూ మహిళా పాడిరైతులకు వర్కింగ్ కాపిటల్ కింద ఒక్కొక్క గేదెకు ప్రధాన మంత్రి పశుకిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రూ.30 వేలు చొప్పున మరో రూ.70 వేలు జీడీసీసీ బ్యాంక్ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో పాడి పరిశ్రమకు గత వైభవాన్ని తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమం పాడిరైతులకు మేలు చేసే కార్యక్రమమని, పాలు అందించే పాడిరైతులకు మెరుగైన ధర అందించి ప్రైవేటు దోపిడీ నుంచి పాడి రైతులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.

కార్యక్రమంలో బొల్లాపల్లి పశువైద్యాధికారి డాక్టర్ పి.అమీర్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు ముంద్రు వెంకటేశ్వర్లు, గాలెం గోవిందరాజులు, మిల్క్ సెక్రటరీ జి.భాగ్యలక్ష్మి, ఏహెచ్ఏ ఏడుకొండలు, గోపాలమిత్ర ఎం. సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

ఎంపీడీవో సీతారామయ్య



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య వెల్లడించారు. గురువారం స్థానిక అంగన్‌వాడీ సెంటరులో పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్లకు ఇచ్చే వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారంతో పాటు అదనంగా ఆకుకూరలు తక్కువ ఖర్చుతో చిరుధాన్యాలతో కూడిన పోషకాహారం తీసుకోవటం వలన రక్తహీనత నియంత్రణ చేయవచ్చునన్నారు. అనంతరం వివిధ రకాల చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించి వాటి వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పుసులూరి లలితాకుమారి, మండల వైద్యాధికారి రాధాకృష్ణణ్, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, ఆరోగ్య కార్యకర్త ఇంకోల్లు నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మధుసూధనరావును సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

నరసరావుపేట ఈస్ట్: కాలానికి ముందు నడిచిన దార్శనికుడు గురజాడ అప్పారావు అని జిల్లెలమూడి మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల ఆంధ్రోపన్యాసకుడు పోల మధుసూదనరావు తెలిపారు. పల్నాడు రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గురువారం గురజాడ 161వ జయంతిని ఘనంగా నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.హనుమంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గురజాడ జయంతి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధుసూదనరావు మాట్లాడుతూ, ఆధునిక సాహిత్య విప్లవ వైతాళికుడిగా గురజాడ తన రచనల ద్వారా సంఘ సంస్కరణకు కృషి చేశారని కొనియాడారు. గురజాడ రచించిన కన్యాశుల్కం, పూర్ణమ్మ కథ, కన్యక వంటి రచనలు నాటి సమాజంలోని దురాచారాలను ఎండగట్టాయని, అవి నేటికీ ప్రజాదరణ పొందుతున్నాయని వివరించారు. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అంటూ దేశభక్తిని సామాన్యులకు కూడా సులువుగా అర్థమయ్యేలా తెలియచేశారని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కాకాని సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో...

పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో గురువారం శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో గురజాడ జయంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సాంఘిక సంస్కరణలకు, తెలుగు సాహిత్యానికి గురజాడ చేసిన సేవలకు కొనియాడారు. కార్యక్రమంలో సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చిన రామిరెడ్డి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముప్పాళ్లలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ఈపూరు: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ముప్పాళ్ల గ్రామంలోని ధనలక్ష్మి వ్యాయామ కళాశాలలో ముప్పాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సహకారంతో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పాఠశాల హెచ్ఎం వి.సాంబానాయక్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. వెంకట్రావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తితో ప్రతిభను కనపరచాలన్నారు. క్రీడాకారులు విజయం సాధించి మండలానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. అండర్–17 బాలురు విభాగంలో ఈ.గోపి (జెడ్పీహెచ్ఎస్, బొగ్గరం), వి.యోహాను (జెడ్పీహెచ్ఎస్, ఈపూరు), బాలికల విభాగంలో జె.వెంకాయమ్మ (జెడ్పీహెచ్ఎస్, కొచ్చర్ల), వి.రోహిణి (జెడ్పీహెచ్ఎస్, ముప్పాళ్ల), అండర్ –14 బాలుర విభాగంలో బి. మహేంద్ర (జెడ్పీహెచ్ఎస్, ముప్పాళ్ల), పి. పవన్ నరసింహా (జెడ్పీహెచ్ఎస్, కొచ్చర్ల), బాలికల విభాగంలో కె.కర్మణి కావ్య (జెడ్పీ హెచ్ఎస్, ఈపూరు), ఎస్.అమృత వర్షిణి (జెడ్పీహెచ్ఎస్, కొచ్చర్ల) లు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎ. వీరాంజనేయులు, ఎం.వెంకటేశ్వర్లు, వై.వి.చిరంజీవి, ఎస్.రూత్‌మేరి, కె.గోపి, కె. ఏసు రాజు, ఉపా ధ్యాయులు ఎన్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గీతా ముఖర్జీ పోరాట ఫలితమే మహిళా బిల్లు



గీతా ముఖర్జీ చిత్రపటం వద్ద మహిళా సమాఖ్య నాయకులు

చిలకలూరిపేట: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కావాలని జీవితకాలం కృషి చేసిన ధన్యజీవి గీతా ముఖర్జీ పోరాట ఫలితమే మహిళా రిజర్వేషన్ బిల్లు అని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ చెప్పారు. మహిళా బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందటం పట్ల ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలు హర్షం ప్రకటించి, గురువారం సంబరాలు నిర్వహించారు. ముందుగా గీతా ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని గత 27 సంవత్సరాలుగా పోరాటం సాగుతోందన్నారు. గీతా ముఖర్జీ ఉభయ సభల జాయింట్ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా రాష్ట్రాలన్ని పర్యటించి 1996 సెప్టెంబర్ 12న మహిళా బిల్లు ప్రవేశపెట్టారని తెలిపారు. ఆమె మహిళలకు సంబంధించిన అనేక కమిటీల్లో ఉండేవారని చెప్పారు. నాడు ఆమె ప్రవేశపెట్టిన మహిళా బిల్లు నేటికి కార్యరూపం దాల్చటం ఎంతో గర్వకారణమని చెప్పారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి బి.లలితకుమారి, సభ్యులు ఎం.వెంకటాద్రి, జి.సుబ్బాయమ్మ, నరసమ్మ, నాగేంద్రం, ఖాశింబి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి

పల్నాడు లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ ఎస్. అనిల్ కుమార్



మాట్లాడుతున్న అనిల్ కుమార్

రొంపిచర్ల: ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్‌లు గ్రామ స్థాయిలో సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ పథకాలపై అవగాహన కల్పించాలని పల్నాడు లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ ఎస్. అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్లు గ్రామ స్థాయిలో సామాన్య ప్రజానీకానికి బ్యాంకింగ్ పథకాలపై, సామాజిక భద్రతా పథకాలపై, డిజిటల్ బ్యాంకింగ్‌పై, ప్రైవేటు ఆర్థిక సంస్థల మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

పల్నాడు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కేఎస్.రామ్ ప్రసాద్ మాట్లాడుతూ సున్నితమైన అంశాలైన బ్యాంక్ అకౌంట్ నంబర్లు, ఏటీఎం కార్డ్ నంబర్లు, ఆధార్ కార్డు నంబర్లు, పిన్ నంబర్లు, ఓటీపీ నంబర్లులు ఎవరితోటి షేర్ చేసుకోకూడదని, ఏమైనా ఇబ్బందులు వస్తే మీ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్‌ను కలవాలని, వ్యక్తిగత సమాచారం తెలియని వ్యక్తులతో పంచుకోకూడదని తెలియజేశారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ రీజనల్ చీఫ్ మేనేజర్ రామ్ బ్రహ్మం, వి. రెడ్డిపాలెం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఎం.రాహుల్ రెడ్డి, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ వై.బాబురావు , బ్యాంకు సిబ్బంది రాజు, వసంత్ కుమార్, తరుణ్, భాస్కర్, స్వామి, రామకోటయ్య, సుబ్బారావు నరసరావుపేట ఆర్థిక అక్షరాస్యత కేంద్ర కౌన్సిలర్లు పి.రత్నాకర్, గౌస్ మస్తాన్, బీసీలు, వీవో ఏలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కేజీబీవీలో క్విజ్ పోటీలు



నాదెండ్ల: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టాండర్డ్స్ క్లబ్‌లో భారతీయ ప్రమాణాలపై మండల కేంద్రమైన నాదెండ్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 9,10 తరగతులు, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు హాజరయ్యారు. ఈ పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయిని సీహెచ్ వెంకటలక్ష్మీ మెంటార్‌గా వ్యవహరించారు. కార్యక్రమానికి ఎక్స్‌టర్నల్‌గా పాలపాడు ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ బీవీహెచ్ రఘురామ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. మొదటి బహుమతి సాధించిన జి.నిఖితకు సర్టిఫికెట్, రూ.వెయ్యి నగదు, రెండో బహుమతి సాధించిన టి.బ్యూలాకు సర్టిఫికెట్, రూ.750లు నగదు, మూడో బహుమతి సాధించిన వి.మేఘనకు సర్టిఫికెట్, రూ.500లు నగదు, నాలుగో బహుమతి సాధించిన పి.శాంతి సర్టిఫికెట్, రూ.250లు నగదును అందుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.మాధవీలత, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం చేయాలి

క్రోసూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విజయవంతం చేయాలని పల్నాడు జిల్లా డెప్యూటీ డీఎంహెచ్ఓ గుడిసె చంద్రశేఖర్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు, సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. క్రోసూరులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్వేను పరిశీలించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు చేశారు. యాప్‌లో అప్లోడ్ తీరును పరిశీలించారు. అనంతరం గరికపాడు సచివాలయంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. గరికపాడులో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి యాప్‌లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని, ఇందులో భాగంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందని చెప్పారు. ఆరోగ్య సమస్యలకు సంబంధించి ప్రతి ఇంటిని ప్రతి వ్యక్తిని కలిసి ఆరోగ్య వివరాలు తెలుసుకోవాలని కోరారు. సెప్టెంబర్ 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నలుగురు వైద్యులు పాల్గొంటారని తెలిపారు.

విద్యకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యం

మాదల(ముప్పాళ్ల): ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. స్థానిక మహాత్మాజ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా రాణించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలతో పాటుగా, హాస్టల్‌లో ఉండే వారికి నాణ్యమైన ఆహారంతో, పౌష్టికాహారం అందించటం జరుగుతుందని చెప్పారు. ఆమె వెంట ఐసీడీఎస్ సీడీపీఓ స్వర్ణకుమారి, పాఠశాల ప్రిన్సిపాల్ మిరియాల వెంకటేశ్వర్లు ఉన్నారు.